క్లుప్తంగా

లోకేష్ పాదయాత్రలో బూటకపు హామీలు



చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: లోకేష్ పాదయాత్రకు జనం నుంచి స్పందన లేకపోయినా బూటకపు హామీలిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆడపిల్లల సంరక్షణ పథకంలో ప్రతీ ఆడపిల్లకు రూ.15వేలు ఇస్తానని లోకేష్ హామీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పిట్టల దొర మాదిరిగా హామీలివ్వడం చూస్తుంటే జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబునాయుడు 648 హామీలిచ్చారని, అయితే వాటిలో 48 హామీలు కూడా అమలు చేయలేదని మండిపడ్డారు.

నరసాపురం రూరల్ సీఐగా గోవిందరాజు



కె గోవిందరాజు

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ సీఐగా కె గోవిందరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈయన గతంలో గుడివాడ, భీమవరం, తణుకు ప్రాంతాల్లో బాధ్యతలు చేపట్టిన సీఐను ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో దాళ్వా సాగు చేయాలి

యలమంచిలి: సకాలంలో దాళ్వా పంట సాగుకు రైతులు ఉపక్రమించాలని నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిల కుమారి కోరారు. కాజ తూర్పు గ్రామంలో మంగళవారం ఆమె రైతులతో సమావేశమై దాళ్వా పంట గురించి వివరించారు. దాళ్వా పంటకు ప్రతి ఎకరాకు సాగు నీరివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే రైతులు కూడా సహకరించి డిసెంబర్ 10 లోపు నారుమడులు వేసి, జనవరి ప్రారంభానికి ఊడ్పులు పూర్తి చేయాలని కోరారు. సాధ్యం కాని పక్షంలో వెదజల్లే పద్ధతిలో దాళ్వా సాగు చేయాలని కోరారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల పంట కాలం తగ్గడమే కాకుండా కూలీల ఖర్చు తగ్గి రైతులకు అదనపు లాభం వస్తుందన్నారు. రైతులు ఎంటీయూ–1121 సాగు చేస్తే పంట అమ్మే సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు. మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు



యలమంచిలి: అడవిపాలెంలో మాట్లాడుతున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి

యలమంచిలి: లంచాలకు, సిఫారసులకు తావులేకుండా గత నాలుగున్నరేళ్లలో ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి అన్నారు. అడవిపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. ముందుగా అడవిపాలెం గ్రామంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా 25 పథకాల ద్వారా రూ.13.95 కోట్లు, పరోక్ష నగదు బదిలీలో మరొక 8 పథకాల ద్వారా రూ.6.42 కోట్లు, గ్రామాభివృద్ధికి రూ.1.10 కోట్లు వెరసి మొత్తం రూ21.47 కోట్లు ఖర్చు చేసినట్లు వివరిస్తూ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను నాయకులు ప్రారంభించారు. చివరగా గగ్గిపర్రు సెంటర్లో వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుంగా జయరాజు ఎగురవేశారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, పార్టీ గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, కంబా సత్యశ్రీ నాయకులు బోనం శ్రీరంగం, సిర్రా నాగరాజు, ఖండవల్లి బాబూరావు, దొంగ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో విప్లవాత్మకమైన మార్పులు

నరసాపురం రూరల్: రాష్ట్రంలో పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చి ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలను తీసుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిట్టవరం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ తదితరులు ఆయా గ్రామాల ప్రగతి నివేదిక ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడి లక్ష్మణరావు, కోళ్ల శ్రీను, చల్లా సత్యనారాయణ, దొంగ మురళీకృష్ణ, ఉంగరాల రమేష్‌నాయుడు, నక్కా లక్ష్మీనారాయణ, కాకిలేటి మధు, వెంకటనారాయణ, చామంతి, చినమిల్లి చందు, తిరుమాని రామకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌కే సాధ్యం

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, అన్ని రంగాల్లోనూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి కోరారు. మండంలోని ఆగర్తిపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో భాగంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆగర్తిపాలెం గ్రామ ప్రజలకు ప్రత్యక్ష, పరోక్ష పథకాల ద్వారా, అలాగే అభివృద్ధి పనుల ద్వారా రూ.15,61,03,468 ప్రయోజనం పొందారని వివరించారు. గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మీకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, మాజీ కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, వైస్ఎంపీపీ పడవల సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు వార్డుల్లో రూ. 21 కోట్లు అభివృద్ధి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు యడ్ల తాతాజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని 11వ సచివాలయం 24,25 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ ఈ రెండు వార్డుల్లో ప్రజలకు ప్రత్యక్షంగా రూ 11.82 కోట్లు, పరోక్షంగా రూ. 5.81 కోట్లు మొత్తం సుమారు రూ. 17.64 కోట్లు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, నాయకులు సాలా నర్సయ్య, చెన్ను విజయ్, బండి రమేష్, మోర్త గిరీష్, దాసరి సత్యనారాయణ, కె. రవి తదితరులు పాల్గొన్నారు.

పి.పోలవరం గ్రామంలో..

పి.పోలవరం గ్రామంలో సర్పంచ్ కుచ్చర్లపాటి పద్మనాభరాజు అధ్యక్షతన మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ప్రగతి నివేదికతో పాటు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సభలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సుమంగళి సాగర్, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కోసం సీఎం జగనే కావాలి

పెనుగొండ: పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి విజయం చేకూర్చాలని పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) అన్నారు. మంగళవారం ములపర్రులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద డిజిటల్ బోర్డు ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే దిక్సూచిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, సర్పంచ్ మద్దె రాజేశ్వరి, మండల కన్వీనర్లు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబి), సాక సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, ఏఎంసీ డైరక్టరు కుసుమే రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు కలగట సాగర్ పాల్గొన్నారు.

భీమలాపురంలో

గతంలో ఎన్నడూలేని విధంగా భీమలాపురం గ్రామంలోనే రూ.7,17,25,848 తో పేదలకు సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆచంట ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య అన్నారు. మంగళవారం ఆచంట మండలం భీమలాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జిలు మొల్లేటి రామకృష్ణ, ముత్యాల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముడకల నాని, పెచ్చెట్టి శ్రీనివాస్, చింతపర్తి మల్లేశ్వరరావు, గుత్తుల దుర్గా ప్రసాద్, కుసుమే రామకృష్ణ, తాడి రాజు, సీహెచ్ పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు.

మార్టేరులో...

పెనుమంట్ర: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మార్టేరు–1 సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ మట్టా కుమారి రాము అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ, మండల పార్టీ కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, సచివాలయ కన్వీనర్ కొవ్వూరి చిన్నారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు చిర్ల సత్యనారాయణరెడ్డి, మార్టేరు ఎంపీటీసీ సభ్యులు కొవ్వూరి అనురాధ జోగిరెడ్డి, గుడిమెట్ల లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పోడూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు అన్నారు. జిన్నూరు సచివాలయం-2 పరిధిలో మంగళవారం సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధి వివరాలతో నివేదికను ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సభలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దిరాజు, ఎంపీపీ సుమంగళి సాగర్‌లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎంతో నమ్మకాన్ని పెంచుకున్నారన్నారు. సర్పంచ్ బేబీమహలక్ష్మి, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు, ఎంపీటీసీ సభ్యురాలు కడలి పద్మావతి, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు, కార్యదర్శి మీసాల నర్సింహులు, తొండా శ్రీను, బొండపల్లి గిరిజ, బ్రహ్మం పాల్గొన్నారు.



నరసాపురం రూరల్: చిట్టవరంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు



పాలకొల్లు అర్బన్: ఆగర్తిపాలెంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి



పోడూరు: జిన్నూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



పెనుగొండ: ములపర్రులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు నడవాలి

నరసాపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని విజయాల వైపు అడుగులు వేయాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి (ఏలూరు) డి. కిషోర్ సూచించారు. మంగళవారం వైఎన్ కళాశాల అరబిందో స్టేడియంలో ఇన్నోవేషన్స్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో కెరీర్ బిల్డింగ్ అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థులు తమకు అనుకూలమైన రంగాలపై దృష్టి పెట్టి ముందుకెళ్లాలని చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, ఎన్ఎస్ఎస్ అధికారులు బీఎస్ఎస్‌వీ ప్రసాద్, యూకోబ్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరత్నం పాల్గొన్నారు.

గ్రామాల్లో బేటీ బచావో-బేటీ పఢావో



పాలకొల్లు అర్బన్: దిగమర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఆడపిల్ల చదువుకోవడం వల్ల సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం షేక్ పీర్ సాహెబ్ అన్నారు. పాలకొల్లు మండలం దిగమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడపిల్లలను చదివిద్దాం–ఆడిపిల్లలను రక్షిద్దాం అనే నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఆడపిల్లలు విద్యావంతులైతే ఆ కుటుంబం ఉన్నతంగా తీర్చిదిద్దుతారన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లల విద్యపై శ్రద్ధ చూపించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జె.హేమలక్ష్మి, వీసీ సుజాత, టి తులసి, జీఎస్ జ్యోతి, జీజీ భవాని పాల్గొన్నారు.

అమ్మాయిల చదువు లోకానికి వెలుగు

యలమంచిలి: అమ్మాయిల చదువు లోకానికి వెలుగని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. బేటి బచావో–బేటి పఢావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం చించినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సమావేశం నిర్వహించి అమ్మాయిల చదువు ప్రాధాన్యతను వివరించారు. బాల్యం నుంచే బాలికలపై కట్టుబాట్ల పేరిట అనవసర ఒత్తిడి తేకూడదన్నారు. అమ్మాయిలను స్వేచ్ఛగా ఎదగనచ్చి, వారు స్వశక్తిపై జీవించేలా చేయాలని ఆమె కోరారు. బాల్య వివాహాలు అనర్థమని, వాటిని ప్రోత్సహించవద్దన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పి.శ్రీనివాసరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ టి.త్రిమూర్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రజని, ఎస్.సుజాత, కె.భారతి, జి.సత్యవతి డ్వాక్రా సీఏ ఎం.కనకదుర్గ పాల్గొన్నారు.

జనసేన నాయకులవి చౌకబారు రాజకీయాలు



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నికుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు

నరసాపురం: నియోజకవర్గంలో జనసేన నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ అగ్నికుల క్షత్రియ సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగపుత్రులను ఆర్థికంగా, రాజకీయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తుంటే అర్థం లేని ఆరోపణలు చేస్తే ఊరికునేది లేదని హెచ్చరించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు మాట్లాడుతూ వైజాగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమైన ఘటనలో బాధిత మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోదని జనసేన నాయకులు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి జరిగిన నష్టంలో 80 శాతం సొమ్మును 48 గంటల్లోనే బాధితులకు అందించారన్నారు. ఈ సంగతి పక్కనపెట్టి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రూ.50 వేలు చొప్పున ఇచ్చి ఆదుకున్నారని చెప్పడం దారుణంగా ఉందన్నారు. అలాగే మారుమూల గ్రామంలో ఉన్న తనను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్ర పదవిలో కూర్చోపెడితే, అలంకారప్రాయంగా పదవులు ఇస్తున్నారని హేళనగా మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు భుజానికెత్తుకుంటున్న టీడీపీ ఏనాడైనా మత్స్యకారులకు రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చిందా? అని ప్రశ్నించారు. ఇప్పుడు జనసేన నాయకుల ముసుగులో ఉండి విమర్శలు చేస్తున్న వారు ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ సబ్సిడీలు, కరెంట్ సబ్సిడీలు పొందలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మొగల్తూరు మండల అధ్యక్షుడు కర్రి ఏసుబాబు, మల్లాడి బుజ్జి, వల్లభాని శేఖర్, సర్పంచ్ తిరుమాని శ్రీను, పెమ్మాడి మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

కన్న కొడుకు కోసం కరపత్రాలు పంచుతూ..

నరసాపురం రూరల్: కుటుంబ పోషణ కోసం సుదూర ప్రాంతమైనా కష్టపడి నాలుగు డబ్బులు ఇంటికి పంపవచ్చునని కొండంత ఆశతో సౌదీ అరేబియా వెళ్లిన భారతీయ కూలీ జైలు పాలయ్యాడు. విడిపించే దిక్కులేక, అక్కడ ప్రభుత్వం విధించిన జరిమానా చెల్లించలేక ఆ యువకుడి తల్లిదండ్రులు కరపత్రాలు పంచుతూ దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు. వివరాల ప్రకారం మొగల్తూరు మండలంలోని పులపర్తి వారి తోటకు చెందిన యాతం జీవ 2021లో సౌదీ అరేబియాకు డ్రైవర్ పని కోసం వెళ్లాడు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలో బంగ్లాదేశీయుడు చనిపోయాడు. దీంతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైల్లో ఉంచారు. అక్కడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీవాను విడుదల చేయాలంటే 2.25 లక్షల రియాల్స్ చెల్లించాల్సి ఉంది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం ఈ పైకం రూ.45 లక్షలు. ఇంత మొత్తం చెల్లించి అక్కడి జైలు నుంచి విడిపించుకుని తెచ్చుకోవడానికి తల్లిదండ్రులైన యాతం నాగేశ్వరరావు, మణికు స్తోమత లేదు. దీంతో వారు కరపత్రాలు పంచుతూ కుమారుడి కోసం విరాళాలు సేకరిస్తున్నారు. అధికారులు, నాయకులు తమకు సాయం చేయాలని కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెనుగొండ: రైతుల సంక్షేమం కోసం పాటు పడుతూ, వారి అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఇలపర్రు సొసైటీ అధ్యక్షుడు వేండ్ర వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఇలపర్రుల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతితో కలిసి ప్రారంభించారు. రైతులను దళారుల నుంచి రక్షించడానికి ప్రభుత్వమే ప్రతీ గింజ కొనుగోలు చేస్తుందన్నారు. మాజీ సర్పంచ్ కేతా భీముడు, సొసైటీ డైరక్టర్లు చిన్నిశ్రీనివాస్, దిడ్ల వెంకట్రావు, కార్యదర్శి నక్కా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుంచి కృతజ్ఞతలు



ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుంచి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పర్వతారోహకుడు దాసు

పెనుగొండ: ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పర్వతం నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరుకు చెందిన గోగుల మండ దాసు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. 5364 మీటర్లు ఎత్తు ఉండే ఎవరెస్ట్ బేస్ క్యాంపు, 5555 మీటర్లు ఎత్తు ఉండే మౌంట్ కలాపతర్‌లను అధిరోహించిన అనంతరం గోగుల మండ దాసు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఫ్లెక్సీని ప్రదర్శించి కృతజ్ఞతలు చెప్పారు. పర్వతారోహణ చేయడానికి ఆర్థికంగా అండగా నిలిచిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు ఈ నెల 24న పర్వతాన్ని అధిరోహించినట్లు ఫోన్‌లో తెలిపారు. త్వరలోనే స్వదేశం తిరిగి వచ్చిన అనంతరం స్వయంగా మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి కృతజ్ఞతలు తెలుపనున్నట్లు తెలిపారు. పర్వతాన్ని అధిరోహించిన దాసును మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు అభినందనలు తెలిపారు.

యలమంచిలి ఎస్సైగా శివనారాయణ

యలమంచిలి: యలమంచిలి ఎస్సైగా కాకి శివనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నూజివీడు టౌన్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ప్రోత్సాహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

పూలే ఆశయాలు నెరవేర్చాలి

పెనుగొండ: మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలు నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) అన్నారు. మంగళవారం జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా ములపర్రులో ఘనంగా నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దే రాజేశ్వరి ప్రసాద్, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

నరసాపురం రూరల్: సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని మంగళవారం మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్లో ఘనంగా నిర్వహించారు. తొలుత సెంటర్లోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం, శీలబోయిన సుబ్బారావు, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లాడి వెంకటేశ్వరావు, రాయుడు కృష్ణారావు, మోటుపల్లి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాసోమేశ్వర స్వామికి లక్షపత్రి పూజ

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు శ్రీ ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని స్వామివారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. అర్చక స్వాములు చేబ్రోలు బాలకృష్ణ గాంధీ, చేబ్రోలు శ్రీనివాస రామమూర్తి, చేబ్రోలు కృష్ణ మోహన్ బ్రహ్మత్వంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. లక్షపత్రి పూజ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తుల విరాళాలతో అన్నసమారాధన చేశారు. ఈఓ యాళ్ల సూర్యనారాయణ, గ్రామ ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, గ్రామ పెద్దలు చంటి, కిషోర్ తదితరులు భక్తులకు సేవలందించారు.